సాక్షి నల్లగొండ

సోమవారం ◆ 8 ◆ సెప్టెంబర్ ◆ 2025



బుద్ధవనంలో ఢిల్లీ బృందం

సాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం ఢిల్లీకి చెందిన ఇండియన్ హెరిటేజ్ ట్రస్ట్ బృందం సందర్శించింది.

- 8లో



ఆన్‌లైన్ ఉచ్చులో

నేటి యువత గంజాయి మత్తులో పడి ఆన్‌లైన్ గేమ్స్ ఉచ్చులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,66,993 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,66,993 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,373 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,454 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

చంద్రగ్రహణం సంపూర్ణం

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి 9.45 గంటల నుంచి చంద్రగ్రహణం ప్రారంభమైంది. రాత్రి 11.15 గంటల వరకు చంద్రగ్రహణం దృశ్యాలు ఇలా ఉన్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



రాత్రి 9.45 గంటలకు | 10.7 | 10:20 | 10:39 | 11:10 | 11:15 గంటలకు

న్యూస్‌రీల్

10 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు

నల్లగొండ టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 17 వరకు జిల్లావ్యాప్తంగా ర్యాలీలు సభలు నిర్వహించి సీపీఎం జెండాలు ఎగురవేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10వ తేదీన చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించి ప్రతి గ్రామంలో, మండలంలో పార్టీ జెండాను ఎగరవేయాలన్నారు. ఈనెల 12న సీపీఎం నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలను నిర్వహించాలన్నారు. సమకాలీన రాజకీయ అంశాలపై సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డికి నివాళి

నల్లగొండ టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట యోదుడు రావి నారాయణరెడ్డి వర్ధంతిని ఆదివారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో తొలిసారిగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నెహ్రూ కంటే అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఘనత రావి నారాయణరెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, కేఎస్.రెడ్డి, శ్రవణ్‌కుమార్, వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బొల్లురి నరసింహ, వెంకటేశ్వర్లు, తూము బుచ్చిరెడ్డి, కెఎస్.రెడ్డి, లెనిన్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

● గవ్వలసరి గలగల!



చందంపేట : పచ్చని చెట్లు.. ప్రకృతి అందాలకు నిలయం.. తెలంగాణ అరకుగా పేరుగాంచిన చందంపేట మండలం పొగిళ్లలోని గవ్వలసరి జలపాతం కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో గవ్వలసరి ప్రాంతం నుంచి పైనుంచి జాలువారుతున్న జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జలపాతం నుంచి నీరు కృష్ణా వెనుక జలాలకు చేరే ఈ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు.

సీజనల్ విజృంభణ

- పల్లెలు, పట్టణాల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- అంతటా పెరిగిన దోమల వ్యాప్తి
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్న జనం
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు

నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్క ప్రాంతంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల ఈ ప్రాంతానికి చెందిన షరీఫ్ మలేరియా బారినపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అతనికి డెంగీ, మలేరియా, ఇతర రక్త పరీక్షలు చేసి రూ.3 వేలు తీసుకున్నారు. డాక్టర్ ఫీజు, మందులకు కలిపి మరో రెండు వేల రూపాయలు అయ్యాయి. షరీఫ్ కుటుంబంలో ఇద్దరికి మలేరియా సోకింది. ఇలా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపంతో జనం సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.



నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం బారులుదీరిన ప్రజలు

నల్లగొండ టౌన్ : జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, డ్రెయినేజీల్లో నీటి నిల్వలు పేరుకుపోయిన కారణంగా దోమలు వ్యాప్తి పెరిగింది. దీనికి తోడు పట్టణాలు, పల్లెలో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారు. రోజురోజుకు జ్వరాల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు డెంగీ కేసులు 11, మలేరియా కేసులు 8 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అనధికారికంగా జిల్లాలో 63 వరకు డెంగీ, 27 వరకు మలేరియా కేసులు ఉన్నట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, వంటి నొప్పులతో బాధపడుతూ జనం బారులుదీరుతున్నారు.

ఆస్పత్రుల్లో పెరిగిన ఓపీ

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గతంలో రోజూ ఓపీ (అవుట్ పేషంట్) 300 వరకు ఉండేది. ప్రస్తుతం 450 వరకు ఓపీ నమోదువుతోంది. ఇన్‌పేషంట్లుగా గతంలో రోజూ 30 వరకు ఉండగా ప్రస్తుతం 50 వరకు చేరుతున్నారు. మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్ ఏరియా ఆస్పత్రులు, మర్రిగూడ సీహెచ్‌సీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, పల్లె దావాఖానాల్లో కూడా జ్వర బాధితుల సంఖ్య పెరిగింది.



నల్లగొండలోని పానగల్ రోడ్డులోని ఓ వీధిలో పేరుకుపోయిన మురుగు

పడకేసిన పారిశుద్ధ్యం..

జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించింది. పాలకవర్గాలు లేకపోవడం, నిధులు లేమి కారణంగా వీధులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. గ్రామాల్లో అయితే సర్పంచ్‌లు లేకపోవడం, పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్యాన్ని పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. చెత్తాచెదారం పేరుకుపోయి దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయింది. సీజనల్ వ్యాధులు పెరగడానికి ఇది కూడా కారణంగా చెప్పవచ్చు. దోమల నివారణ కోసం మున్సిపల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని మలేరియా శాఖ పట్టణాలు, పల్లెల్లో ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఆ రెండు శాఖ ఫాగింగ్ చేయడాన్ని మరిచిపోయాయి. సిబ్బంది ఉన్నప్పటికీ పాగింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

సిబ్బందిని అప్రమత్తం చేశాం

సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు డాక్టర్లు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో మందులు అందుబాటులో ఉంచాం. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలి.

– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ

ప్రైవేట్‌లో పరీక్షల పేరుతో దగా..

జ్వరంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెలుతున్న బాధితుల నుంచి డెంగీ, మలేరియా ఇతర పరీక్షల పేరుతో ఆస్పత్రుల యాజమాన్యం దగా చేస్తోంది. వివిధ పరీక్షల పేరుతో వేలాది రూపాయలను దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డెంగీ పరీక్షలు కేవలం ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రమే చేస్తారు. ఎలిసా పరీక్ష ద్వారానే డెంగీ నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ధనార్జనే ధ్యేయంగా డెంగీ పేరుతో అవసరం లేని పరీక్షలు చేసి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

పురుగులు, తుట్టెలు!



నల్లగొండలోని ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం



దొడ్డు బియ్యంలో కనిపిస్తున్న పురుగులు, తుట్టెలు

రేషన్‌షాపుల్లో ముక్కిపోతున్న దొడ్డుబియ్యం

- ఐదు నెలలుగా ఏ నిర్ణయం తీసుకోని అధికారులు
- సన్న బియ్యానికి చేరుతున్న పురుగులు
- ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లు

దొడ్డు బియ్యం నిల్వ ఇలా..

రేషన్ దుకాణాల్లో 1500 మెట్రిక్ టన్నులు

ఎంఎల్ఎస్ పాయింట్లలో 105.792 మెట్రిక్ టన్నులు

బఫర్ గోదాముల్లో 4,322.057 మెట్రిక్ టన్నులు

నల్లగొండ : రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం ముక్కిపోతున్నాయి. ఈ ఏడాది మార్చి వరకు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేయగా.. ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. అంతకుముందు రేషన్ దుకాణాలకు సరఫరా చేసిన దొడ్డుబియ్యం ఐదు నెలలుగా వృథాగా ఉంటున్నాయి. దీంతో చాలా చోట్ల ఈ బియ్యం పురుగులు పట్టి, తుట్టెలు కడుతున్నాయి. ప్రభుత్వం దొడ్డు బియ్యం ఆయా చోట్లనుంచి ఖాళీ చేయకుండానే సన్న బియ్యం స్టాక్ పెట్టింది. దీంతో అప్పటికే నిల్వ ఉన్న దొడ్డుబియ్యం నుంచి పురుగులు సన్న బియ్యానికి పడుతున్నాయి.

పేరుకుపోయిన దొడ్డుబియ్యం నిల్వలు

జిల్లాలోని రేషన్‌దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గోదాముల్లో ఆరువేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. సన్న బియ్యాన్ని పంపిణీ చేసే క్రమంలో రేషన్ షాపుల నుంచి మిగిలిఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం సేకరించలేదు. దీంతో డీలర్లు రేషన్ షాపులోనే ఒక మూలన పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆ బియ్యం పురుగులు, తుట్టెలు పట్టి పనికి రాకుండా పోతుంది. ఒక పక్క రేషన్ షాపులు చిన్నగా ఉండటంతో దొడ్డు బియ్యం నిలవ్వలతో సగం షాపులు నిండిపోవడంతో సన్న బియ్యం కోటా రావడంతో షాపుల్లో స్థలం సరిపోక చాలా ప్రాంతాల్లో రేషన్‌డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు దొడ్డు బియ్యం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో 997 రేషన్ షాపులు

జిల్లాలో 997 రేషన్ షాపులు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో సన్న బియ్యం పంపిణీకి ముందు ఆయా రేషన్‌షాపుల్లో మొత్తం 1500 మెట్రిక్ టన్నుల పైచిలుకు దొడ్డు బియ్యం ఉన్నట్లు అంచనా. అయితే బియ్యం కేటాయింపు నిల్వలంతా రాష్ట్రస్థాయి నుంచే ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతుంది. సన్న బియ్యం పంపిణీ సందర్భంలో దొడ్డు బియ్యం నిల్వకు సంబంధించిన ఆన్‌లైన్ నిలిపివేసి.. సన్న బియ్యానికి సంబంధించిన ఆన్‌లైన్ విధానం అమలు చేశారు. దీంతో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల వద్ద ఏ రేషన్ షాపుల్లో ఎంత దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయో తెలియడం లేదు.

దొడ్డు బియ్యం తీసుకుపోవాలి



ఏప్రిల్ నుంచి ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తుంది. మా వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని ఇప్పటి వరకు తీసుకోలేదు. రేషన్‌షాపులో స్థలం లేక ఇబ్బంది కలుగుతోంది. దానికి తోడు దొడ్డు బియ్యానికి పురుగు వస్తుంది. అది సన్న బియ్యానికి కూడా అంటుకునే ప్రమాదం ఉంది. వెంటనే దొడ్డు బియ్యం నిల్వలను తరలించాలి.

– అశోక్‌రెడ్డి, డీలర్, నల్లగొండ

దొడ్డు బియ్యంపై పట్టింపేది..

జిల్లాలో గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లతో పాటు రేషన్ షాపుల్లో 6 వేల మెట్రిక్ టన్నుల వరకు దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. ఈ బియ్యంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వాటిని ఏమి చేయాలో తెలియక రేషన్ డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రేషన్ షాపుల నుంచి వెనక్కు తీసుకుని వాటిని వేలం ద్వారా అమ్మడమా.. లేక ఇతర ప్రాంతాలకు తరలించడమా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

14 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు



నాగార్జునసాగర్ : ఎగువ నుంచి వరద పెరగడంతో నాగార్జునసాగర్ జలాశయం 14 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 1,67,440 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. 14 గేట్ల ద్వారా 1,16,926, విద్యుత్ ఉత్పాదనతో 33,292 క్యూసెక్కులు మొత్తం 1,46,786 క్యూసెక్కుల నీటిని కృష్ణానదిలోకి వదులుతున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాలువలతో కలిపి మొత్తం 1,67,440 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం

భూదాన్‌పోచంపల్లి: స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ(ఎస్ఆర్‌టీఆర్ఐ)లో నిర్వహించే వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకొని, అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించి ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే విధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఎస్ఆర్‌టీఆర్ఐ చైర్మన్ డాక్టర్ కిషోర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, ఎస్ఆర్‌టీఆర్ఐ చైర్మన్ కిషోర్‌రెడ్డి సమక్షంలో అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి, ఎస్ఆర్‌టీఆర్ఐ డైరెక్టర్ హరికృష్ణ అవగాహన పత్రాలపై సంతకాలు చేశారని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యయోజన పథకం ద్వారా అమలు చేస్తున్న వృత్తి విద్యా కోర్సులను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్ప చక్రపాణి, స్కిల్ డెవలప్‌మెంట్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, ఈఎంఆర్‌ఆర్‌సీ డైరెక్టర్ రవీంద్రనాథ్ సోలమన్, ఆయా విభాగాల డైరెక్టర్లు, డీన్లు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న వీసీ, చైర్మన్

ఆలయాల మూసివేత

యాదగిరిగుట్ట : చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను మూసివేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో ద్వార బంధనం చేశారు. ఈ విషయాన్ని ఆలయ అధికారులు ముందుగానే ప్రకటించడంతో భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, బస్టాండ్, ప్రసాద విక్రయశాల తదితర ప్రాంతాలన్నీ భక్తులు లేక బోసిపోయాయి.

సీపీఐ నిరసన

సంస్థాన్ నారాయణపురం: అదనపు తరగతి గదుల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రొటోకాల్ వివాదం నెలకొంది. తమ ఎమ్మెల్సీని అవమానపరిచారంటూ సీపీఐ నేతలు నిరసన వ్యక్తం చేశారు. సంస్థాన్ నారాయణపురంలోని కస్తూరిబాగాంధీ గురుకుల విద్యాలయంలో అదనపు తరగతులు గదుల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను ఆహ్వానించలేదని పార్టీ నాయకులు శిలాఫలం ఎదుట టెంట్ వేసి నిరసన తెలిపారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, డీఈని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో దుబ్బక భాస్కర్, గాలయ్య, అంజయ్య, పల్లె మల్లారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరత

- పెద్దసంఖ్యలో టీచర్లు, హెల్పర్ల పోస్టులు ఖాళీ
- ఉన్న వారికి అదనపు బాధ్యతలు
- అరకొరగా అందుతున్న సేవలు

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాలను సిబ్బంది కొరత వేధిస్తోంది. పెద్దసంఖ్యలో టీచర్లు, ఆయా పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఖాళీ భర్తీకి రిజర్వేషన్ల ప్రక్రియ అడ్డొస్తోందని తెలుస్తోంది.

834 పోస్టులు ఖాళీ

నల్లగొండ జిల్లాలో 9 ప్రాజెక్టుల పరిధిలో 2,093 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6 ఏళ్లలోపు పిల్లలు 75,819 మంది, గర్భిణులు 8,659, బాలింతలు 6,360 మంది నమోదై ఉన్నారు. ఆయా కేంద్రాల్లో 150 టీచర్లు, 684 ఆయాలు మొత్తం 834 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

టీచర్లకు అదనపు బాధ్యతలు

ఒక అంగన్‌వాడీ కేంద్రంలో టీచరు పోస్టు ఖాళీగా ఉంటే సమీప కేంద్రంలోని వారికి అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఒక్కో టీచరు రెండు కేంద్రాలకు ఇన్‌చార్జిగా ఉండడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందడం లేదు. అదే విధంగా ఆయాలు లేకపోవడంతో కొన్ని సెంటర్లల్లో టీచర్లకు అదనపు బాధ్యతలను అప్పగించారు. అక్కడ టీచర్లే భోజనం వండి వడ్డించాల్సి వస్తోంది. టీచర్లు లేని సెంటర్లలో ఆయాలే అన్నింటినీ చూసుకుంటున్నారు. అయితే వారు ఒక కేంద్రంలో విధుల్లో ఉంటే మరో కేంద్రం మూసి వేయాల్సిన వస్తోంది. కొన్ని కేంద్రాలు తెరవకుండానే వారానికి ఒకసారి వెళ్లి సరుకులు పంపిణీ చేసి వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



మిర్యాలగూడ పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు

ఖాళీల వివరాలు ఇలా..

ప్రాజెక్టు	టీచర్లు	ఆయాలు
అనుముల	20	65
చింతపల్లి	24	73
దామరచర్ల	11	95
దేవరకొండ	34	99
కొండమల్లేపల్లి	21	66
మిర్యాలగూడ	16	58
మునుగోడు	06	51
నకిరేకల్	10	87
నల్లగొండ	08	90
మొత్తం	150	684

మార్గదర్శకాలు రాలేదు



జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే పోస్టుల భర్తీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలోని అంగన్‌వాడీ టీచర్లకు అదనపు బాధ్యతలను ఇచ్చి చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. పోస్టులు భర్తీ అయ్యేంత వరకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తాం.

– కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారి, నల్లగొండ

రిజర్వేషన్ల వర్తింపుతో జాప్యం

అంగన్‌వాడీ కేంద్రానికి ఒక టీచరు, ఒక హెల్పర్ విధిగా ఉండాలి. కానీ చాలా వరకు పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ప్రాజెక్టుల వారీగా ఖాళీల వివరాలను ఆ శాఖకు చెందిన అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. ఎస్సీ వర్గీకరణ ఆధారంగా ప్రస్తుతం టీచర్లు, హెల్పర్లను మూడు గ్రూపులుగా గుర్తించి నివేదిక పంపారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. దీంతో కొలువుల భర్తీపై సందిగ్ధం నెలకొంది. అయితే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వర్తింపు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

● అయ్యో.. గణనాథా..!



గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. భారీ ఎత్తున శోభాయాత్రలు నిర్వహించి గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. కానీ నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని వల్లభరావు చెరువులో విగ్రహాలన్నీ ఒకే చోట వేయడంతో అవి పూర్తిగా నీటిలో మునగకపోవడంతో.. అయ్యో గణనాథా అంటూ అటువెళ్లే వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

మునగాల: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మునగాల మండలం ముకుందాపురం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం ఎకలాస్‌ఖాన్‌పేట తండాకు చెందిన బాణోతు సేవ్య(60) ద్విచక్ర వాహనంపై కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పాత ముకుందాపురంలో కూరగాయలు విక్రయించి స్వగ్రామం వెళ్లేందుకు ముకుందాపురం గ్రామ స్టేజీ వద్ద బైక్‌పై హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి కోదాడ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి మనవడు బానోతు సాయిభరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఇంటి గేటుపై నుంచి పడి మృతి

భువనగిరి: ప్రమాదవశాత్తు ఇంటి గేటుపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాజ్‌పూర్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి శ్రీనివాస్(54) కుటుంబంతో కలిసి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడెం ప్రాంతంలో నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం వారు గ్రామానికి వచ్చాడు. మద్యం సేవించిన శ్రీనివాస్ ఆదివారం మధ్యాహ్నం తన ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా.. అతడి భార్య గమనించి బయటకు వెళ్లకుండా ఇంటి గేటుకు తాళం వేసింది. దీంతో అతను కొద్దిసేపటి తర్వాత గేటు ఎక్కి బయటకు వెళ్లేందుకు యత్నిస్తుండగా.. ప్రమాదవశాత్తు గేటుపై నుంచి కిందపడ్డాడు. అతడి తల, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వేములపల్లి: గణేష్ నిమజ్జనం చేస్తుండగా సాగర్ ఎడమ కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన పున్నా సాంబయ్య, అతడి కుమారుడు శివమణి ఈ నెల 5న గణేష్ నిమజ్జనం చేసేందుకు వచ్చి వేములపల్లి మండల పరిధిలోని సాగర్ ఎడమ కాల్వలో గల్లంతయ్యారు. శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామ శివారులో కాల్వ వెంట సాంబయ్య మృతదేహం లభ్యం కాగా... ఆదివారం గరిడేపల్లి మండలం పానుగోడు రిజర్వాయర్‌లో శివమణి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మత్తులో.. ఆన్‌లైన్ ఉచ్చులో..

- గ్రామాలకు విస్తరిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి
- చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్న యువత



ఆలేరురూరల్: పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్, గంజాయి మత్తు క్రమక్రమంగా పల్లెలకు కూడా పాకుతోంది. అంతేకాకుండా గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుండడంతో యువత మద్యానికి బానిసలవుతున్నారు. గతంలో పల్లెల్లో విచ్చలవిడిగా ఉన్న గుడుంబా దుకాణాలు ప్రస్తుతం కనిపించకుండా చేసిన అధికారులు.. బెల్ట్ షాపులను మాత్రం అరికట్టలేకపోతున్నారు. ఆలేరు బైపాస్ రోడ్డులో రాత్రి సమయంలో ప్రతి షాపులో మద్యం అమ్మకాలు జోరుగా నడుస్తున్నాయి. ఆలేరు మండలంతో పాటు మిగతా మండలాల్లోని గ్రామాలు, మండల కేంద్రాల్లో యువత గంజాయికి అలవాటు పడుతూ తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. ఎంత మందలించినా మార్పు ఉండడం లేదని కొంతమంది తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. కొంత మంది యువత గంజాయి మత్తుకు బానిసై చదువు మధ్యలోనే ఆపేసి అల్లరి చిల్లరగా తిరుగుతున్నారు. మరికొందరు గంజాయి సేవించడానికి అప్పులు చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్నారు. ప్రధానంగా ఇటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్మానుష్య ప్రదేశాలను కేంద్రంగా చేసుకొని గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. మత్తులో బలవన్మరణాలతో పాటు హత్య చేసే స్థాయికి దిగజారుతున్నారు.

ఈజీ మనీకి అలవాటు పడి..

యువత ఈజీ మనీకి అలవాటు పడి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడటం, క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టి నష్టపోతున్నారు. ఆలేరు మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటై అప్పులపాలయ్యాడు. అతడి కుటుంబ సభ్యులు కొంత పొలం అమ్మి అప్పులు తీర్చారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌తో పాటు గంజాయి, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్ షాపులు తీసివేయాలి



పల్లెల్లో బెల్ట్ షాపుల వలన యువత చెడిపోతున్నారు. మద్యం దుకాణాలను మండల కేంద్రాలకు మాత్రమే పరిమితం చేయాలి. బెల్ట్ షాపులు గ్రామాల్లో 24 గంటలు అందుబాటులో ఉండటంతో తాగుడుకు బానిసలవుతున్నారు. ఇంట్లో పెద్దలు తాగి గొడవలు చేస్తుండటంతో పిల్లలు కూడా అదే తోవ పడుతున్నారు.

– బైరి మహేందర్‌గౌడ్, సాయిగూడెం

వ్యసనాలకు దూరంగా ఉండాలి



చెడు వ్యసనాలకు, గంజాయి మత్తుకు యువత దూరంగా ఉండాలి. పిల్లలు కదలికలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, పేకాట ఆడుతున్నట్లు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– యాలాద్రి ఎస్‌హెచ్‌ఓ, ఆలేరు పోలీస్ స్టేషన్

వినాయక శోభాయాత్రలో ఘర్షణ

- బేతవోలు గ్రామంలో ఘటన
- విచారణ చేస్తున్న పోలీసులు

చిలుకూరు: చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో శనివారం రాత్రి జరిగిన వినాయక శోభాయాత్రలో ఘర్షణ చోటుచేసుకుంది. ట్రాక్టర్‌పై వినాయకుడిని తీసుకెళ్తుండగా గ్రామ బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ట్రాక్టర్ తగిలింది. వెంటనే గుర్తించిన నిర్వాహకులు ట్రాక్టర్‌ను పక్కకు తీశారు. దీంతో అక్కడే ఉన్న దళితులకు, నిమజ్జనానికి వెళ్తున్న పలువురు గ్రామస్తులకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండగా.. ఘటన జరిగిన సమయంలో తమను అగౌరవపరిచేలా పలువురు వ్యాఖ్యానించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం పలువురు దళితులు బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద టెంట్ వేసి నిరసన దీక్ష చేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని టెంట్ తీయించారు. ఈ ఘటనపై దళితులు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అయితే రాజకీయంగా తమను ఎదుర్కోలేకే కొందరు వ్యక్తులు చిన్న చిన్న ఘటనలకు తమపై అట్రాసిటీ కేసులు పెడుతున్నారని మరో వర్గం వారు అంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

బేతవోలులో వర్గ పోరు..

బేతవోలు గ్రామంలో పండుగలు, ఉత్సవాల సమయంలో ఘర్షణలు జరగడం సర్వసాధారణం అయ్యిందని గ్రామస్తులు అంటున్నారు. గతేడాది దసరా పండుగ రోజు గ్రామంలో పెద్దఎత్తున ఘర్షణలు జరగడంతో 8మందిపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత రామాలయం కమిటీ ఎంపిక సమయంలోనూ ఘర్షణలు జరిగి రెండు వర్గాల వారు రాళ్లు విసురుకోవడంతో ఐదుగురిపై కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా గ్రామంలో జరిగిన కనకదుర్గ జాతరలోనూ ఘర్షణలు జరిగాయి. అయితే అధికార పార్టీలో నెలకొన్న వర్గ పోరే ఈ ఘర్షణలకు కారణమని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు, పెద్దమనుషులు కలిసి గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చదివింది పీజీ.. చేస్తోంది పారిశుద్ధ్య పని



మురుగు కాలువ శుభ్రం చేస్తున్న సందీప్

మిర్యాలగూడ టౌన్: పీజీ చదివిన యువకుడు కుటుంబ పోషణ కోసం పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అవిరెండ్ల సందీప్ పీజీ చదివాడు. సందీప్ తల్లి ధనమ్మ చాలకాలం వరకు మిర్యాలగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేసింది. ఆమె ఆనారోగ్యానికి గురికావడంతో 2021లో తల్లి స్థానంలో సందీప్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుడిగా ఉద్యోగంలో చేరాడు. అయితే పీజీ చేసిన సందీప్ పారిశుద్ధ్య కార్మికుడిగా మురుగు కాలువలను శుభ్రం చేయడం, రోడ్లు ఊడ్చడం, గడ్డి తీయడం వంటి పనులు పని చేస్తున్నాడు. తన చదువు తగినట్లుగా మున్సిపాలిటీలో ఏదైనా రాత పని ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం సమీపంలో మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ తెలిపారు. ఆదివారం మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. మరిపెడ మండలం ఉల్లెపల్లికి చెందిన బంటు వెంకటమ్మ(55) వ్యవసాయ కూలి మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ సాగల వీరన్నతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో వీరన్నకు అప్పుడప్పుడు వెంకటమ్మ అప్పు ఇచ్చేది. ఈ క్రమంలో ఆగస్టు 31న తనకు అప్పు కావాలంటూ వీరన్న.. వెంకటమ్మకు ఫోన్ చేసి మరిపెడకు రావాలని కోరాడు. దీంతో ఇద్దరు మరిపెడలో కలుసుకున్నారు. అనంతరం మద్యం కొనుగోలు చేసి పురుషోత్తమాయగూడెం శివారుకు వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత వీరన్న డబ్బులు అడిగాడు. తన దగ్గర డబ్బులు లేవని వెంకటమ్మ చెప్పింది. దీంతో వీరన్న.. ఆమె శరీరంపై ఉన్న నగలు బలవంతంగా లాక్కొంటుండగా ఆమె ప్రతిఘటించింది. ఈ క్రమంలో మద్యం సీసాతో ఆమె ముఖంపై దాడి చేశాడు. అనంతరం గొంతు నులిమి హతమార్చి పక్కన ఉన్న నీటిగుంటలో పడేశాడు. వెంకటమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో కేవలం వారం రోజుల్లోనే పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అతడి నుంచి నాలుగు తులాల బంగారు ఆభరణాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.

జాతీయ పోటీలకు ఎంపిక



జతీన్ యాదవ్

పెద్దవూర: జాతీయస్థాయి ట్రిబుల్ జంప్ పోటీలకు పెద్దవూర మండలం నాయనవాని కుంట గ్రామానికి చెందిన నడ్డి బాలరాజు యాదవ్, అంజలి దంపతుల కుమారుడు జతీన్ యాదవ్ ఎంపికయ్యాడు. గత నెల ఏపీలోని నెల్లూరులో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి అండర్–19 సీబీఎస్‌ఈ క్లస్టర్ ట్రిబుల్ జంప్ పోటీల్లో జతీన్‌యాదవ్ పాల్గొని రజత పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జతీన్‌యాదవ్ ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జతీన్‌యాదవ్ ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి మోతె మండలం బోల్యాతండాకు వెళ్తున్న ఆటో మార్గమధ్యలో చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోల్యాతండాకు చెందిన ఆటో డ్రైవర్ ధరావతు రవి కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

కోదాడరూరల్: కోదాడ మండలం గుడిబండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని కోదాడ రూరల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిబండ గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం పక్కన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు చేసి అదే గ్రామానికి చెందిన షేక్ జానీపాషా, షేక్ పాషా, మహ్మద్ జానీ, కందరబోయిన ఎల్లయ్య, వీరబ్రహ్మం, ఎండీ కరీంను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.2200 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కడపర్తిలో నలుగురు..

నకిరేకల్: నిమ్మ తోటలో పేకాట ఆడుతున్న నలుగురిని నకిరేకల్ పోలీసులు ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండల పరిధిలోని కడపర్తి గ్రామ శివారులో ఓ నిమ్మ తోటలో పలువురు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు నకిరేకల్ ఎస్ఐ లిచ్చిరెడ్డి, తన సిబ్బందితో కలిసి దాడులు చేసి నలుగురిని పట్టుకున్నారు. మరొకరు పరారయ్యారు. వారి నుంచి రూ.300 నగదు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి నిత్య కల్యాణాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు. ఉదయాన్నే ఆలయాన్ని తీసిన అర్చకులు సుప్రభాతం, ఆరాధన నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమాన్ని జరిపించి, అనంతరం గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు చేశారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సంపూర్ణ చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12.05గంటలకు మూసివేశారు.



మాంట్రియల్‌లో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మాంట్రియల్ నగరంలో..

తెలంగాణ కెనడా అసోసియేషన్(టీసీఏ) ఆధ్వర్యంలో కెనడాలోని మాంట్రియల్ నగరంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ విశ్రాంత ప్రధాన అర్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అధికారి గజివెల్లి రఘు, టీసీఏ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మన్నెం ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మాంట్రియల్ నగరంలోని ఓ హాల్‌లో స్వామి, అమ్మవార్లను అలంకరించి పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా కల్యాణం జరిపించారు. ఈ వేడుకలో తెలంగాణ కెనడా అసోసియేషన్ సభ్యులు, కెనడాలోని వివిధ నగరాల భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిపై సమావేశం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించేందుకు గాను హరే కృష్ణ మూమెంట్ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస స్వామిజీ, ఆయన బృందంతో ఆలయ ఈఓ వెంకట్రావ్ ఆదివారం సమావేశమయ్యారు. ఆలయంలో ఎలాంటి వైదిక, ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలనే విషయాలను ఈఓ అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించి, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని హరే కృష్ణ మూమెంట్ బృందాన్ని ఈఓ కోరారు.



హరే కృష్ణ మూమెంట్ ప్రతినిధులతో ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి

ఈ సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, డిప్యూటీ ఈఓ దోర్బల భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన ఢిల్లీ బృందం



బుద్ధవనంలో ఇండియన్ ట్రస్ట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ హెరిటేజ్ బృందం సభ్యులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన ఇండియన్ ట్రస్ట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ హెరిటేజ్ సంస్థకు చెందిన బృందం సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధ చరితం, జాతక వనం, ధ్యాన వనం, స్తూప వనాలను సందర్శించి మహాస్తూపంలోని అంతర్భాగంలో ఉన్న ధ్యాన మందిరాన్ని వీక్షించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రులు బుద్ధవనం వివరాలను వివరించారు. అనంతరం పంచశీల కండువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ రేగుల మల్లికార్జునరావు మాట్లాడుతూ.. గ్రామీణ వారసత్వం, అభివృద్ధి కోసం భారతీయ ట్రస్ట్ సంస్థ నాగార్జునసాగర్‌లో బుద్ధిజం అకాడమీ స్థాపించడానికి విజయపురి సౌత్‌లోని అవసరమైన స్థల పరిశీలన చేశామని అన్నారు. ఈ సంస్థ గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతులను పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. స్థానిక యువతకు కావాల్సిన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థల పరిశీలన చేసిన వారిలో ఇండియన్ ట్రస్ట్ ఫర్ రూరల్ హెరిటేజ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ వైస్ చైర్మన్ ఏజీకే మీనన్‌తో పాటు బృందం సభ్యురాలు ప్రీతి, పల్నాడు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

- బాధితుడి ఫిర్యాదు మేరకు మాజీ కౌన్సిలర్‌పై కేసు నమోదు
- పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామంలో యువకుడిపై హత్యాయత్నం జరిగిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దురాజ్‌పల్లి గ్రామానికి మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు షేక్ బాషా తనపై బాటిల్‌తో దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించాడని అదే గ్రామానికి చెందిన షేక్ మునీర్ చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు బాషాపై కేసు నమోదు చేసి ఆదివారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాషాను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆందోళన చేపట్టారు. దీంతో చివ్వెంల సీఐ పెన్‌పహాడ్, సూర్యాపేట రూరల్ ఎస్ఐలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం ఘటనా స్థలానికి వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించగా.. బాధితుడి వెంట బాషా వచ్చినట్లు గుర్తించి అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మూడు గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టారు. అనంతరం తదుపరి విచారణకు సహకరించాలని తెలుపుతూ బాషాను ఇంటికి పంపించారు. ఈ కేసులో ఇంకా కొన్ని సీసీ కెమెరాలు పరిశీలించాలని, పూర్తి విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామని సీఐ పేర్కొన్నారు.




పోలీస్ స్టేషన్ వద్ద దురాజ్‌పల్లి గ్రామస్తుల ఆందోళన



గాయపడిన మునీర్

స్ప్రేయర్ల ఎంపిక కీలకం

- సరైంది ఎంచుకోకపోతే రసాయనం వృథా



పెద్దవూర: మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలను పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో రైతులకు పంటలపై ఒకటికి రెండుసార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం పరిపాటిగా మారింది. పిచికారీ చేసేందుకు అవసరమైన స్ప్రేయర్లను సరిగ్గా ఎంపిక చేసుకోకపోతే రసాయన మందులు వృథా కావడంతో పాటు పిచికారీ చేసే వ్యక్తి శరీరంపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం పత్తి, మిరప, వరి పంటలకు చీడపీడల బెడదతో పాటు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. రైతులు క్రిమిసంహారక మందులను పిచికారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల స్ప్రేయర్లకు సంబంధించిన విషయాలను పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ వివరించారు.

తైవాన్ పవర్ స్ప్రేయర్..

ఇటీవల అన్ని రకరాల పంటలకు తైవాన్ పవర్ స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేస్తున్నారు. దీని ఖరీదు కంపెనీలను బట్టి రూ.20వేల వరకు ఉంటుంది. దీనికి తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో వెదజల్లే సామర్థ్యం ఉంది. ఇతర వాటితో పోల్చితే దీనిలో సస్యరక్షణ మందులు మూడు వంతులు అధికంగా పోయాల్సి ఉంటుంది. రోజుకు సగటున 8 నుంచి 10 ఎకరాల్లో పిచికారీ చేయొచ్చు. దీనికి అమర్చిన బెల్ట్ ద్వారా భుజాల వెనుక సులభంగా తగిలించుకోవచ్చు. ఈ పవర్ స్ప్రేయర్ చదరపు సెంటీమీటర్‌కు 30–35 కిలోల ఒత్తిడిని కలగజేస్తుంది. ధ్వని కాలుష్యం తక్కువ, ఒకేసారి 20 అడుగుల వెడల్పుతో పిచికారీ చేయొచ్చు. మందు వేగం గంటకు 60 కి.మీ. ఇంజిన్ సహాయంతో గాలి అధిక ఒత్తిడితో బయటకు రావడం వలన మందును స్ప్రేయర్ నాజిల్ 150–200 మైక్రాన్ సైజుతో ఉండే చిన్నచిన్న బిందువులుగా విడగొట్టి అధిక విస్తీర్ణంలో మందు పడేలా చేస్తుంది. నీటి బిందువులు గుండ్రంగా తిరగడం వలన ఆకుల పైభాగాన, కింది భాగాన పడతాయి. ఇంజిన్ పనిచేయడానికి గంటకు లీటర్ పెట్రోల్ అవసరం అవుతుంది. లీటర్ పెట్రోల్ ఆరు ఎకరాలకు సరిపోతుంది. నిమిషానికి 7.2 లీటర్ల మందును చల్లవచ్చు. బరువు తొమ్మిది కిలోలు ఉంటుంది. దీనిలో 20 లీటర్ల రసాయం ద్రావణం, 900 మి.లీ. పెట్రోల్ పడుతుంది. ఇటీవల వచ్చిన ఆధునాతన పవర్ స్ప్రేయర్‌లతో ఒక వ్యక్తి మందు ద్రావణ డబ్బాను భుజానికి తగిలించుకుంటే రెండు వైపులా ఇద్దరు వ్యక్తులు ఏకకాలంలో రసాయన మందును పిచికారీ చేయొచ్చు.



తైవాన్ స్ప్రేయర్



నాప్‌సాక్ స్ప్రేయర్

ఫుట్ స్ప్రేయర్

ఇది కాళ్లతో పనిచేస్తుంది. మినుము, పెసర వంటి పంటలతో పాటు కూరగాయ తోటలు, మామిడి, బత్తాయి వంటి పండ్లతోటల్లో సస్యరక్షణ మందులను పిచికారీ చేయొచ్చు. రోజుకు రెండు ఎకరాల్లో, పండ్ల తోటల్లో సగటున రోజుకు 150 చెట్లకు పిచికారీ చేయొచ్చు. ధర రూ.4వేల లోపే ఉంటుంది. ఇత్తడితో తయారైన ఫుట్‌స్ప్రేయర్‌లో ప్రధానంగా చిన్న బ్యారల్, కదిలే పిస్టన్ ఉంటుంది. బ్యారల్ అడుగుభాగానికి ప్లాస్టిక్ గొట్టం కలపబడి ఉంటుంది. రెండో చివరన ఫిల్టర్ గరాటు బిగించబడి ఒక పాత్రలోని రసాయన ద్రావణంలో మునిగి ఉంటుంది. పెడల్‌ను కాళ్లతో తొక్కినప్పుడు పిస్టన్ బ్యారల్‌లో పైకి కిందికి కదలడంతో ద్రావణం బ్యారల్ పైభాగానికి చేరి అక్కడి నుంచి గాలి గది ద్వారా రెండో గొట్టం చివర ఉన్న నాజిల్ గుండా బయటకు వెళ్తుంది. గాలి గది అమరిక వల్ల ద్రావణంపై పీడనం ఎల్లప్పుడు సమానంగా ఉంచి పిచికారీ ఒకే విధంగా ఉండటానికి తోడ్పడుతుంది. దీనిలో చదరపు సెంటీమీటర్‌కు 8 నుంచి 13 కిలోల ఒత్తిడి తీసుకు రావచ్చు. అధిక ఒత్తిడి వలన ఎత్తుగా ఉన్న మామిడి చెట్లకు సులభంగా పిచికారీ చేయొచ్చు.

నాప్‌సాక్ స్ప్రేయర్

దీని బరువు తక్కువగా ఉండేందుకు పాలిథిన్‌తో తయారు చేశారు. స్ప్రేయర్ ట్యాంకు పరిమాణం 15–16 లీటర్లు. దీనికి ఉన్న బెల్టుల ద్వారా భుజాల వెనక సులువుగా తగిలించుకోవచ్చు. పంట అన్ని దశల్లో మందు పిచికారీకి స్ప్రేయర్ సులువుగా ఉపయోగపడుతుంది. ధర రూ.2వేల లోపే ఉంటుంది. ట్యాంకు లోపలి భాగాన పంపు, గాలి గది, పైభాగాన ఒక రంధ్రానికి ప్లాస్టిక్ గొట్టం బిగించబడి ఉంటుంది. రెండో చివర నాజిల్ ఉంటుంది. ట్యాంకులో అమర్చబడిన పిస్టన్ పైకి కిందకు కదలడం వలన ద్రావణంపై ఒత్తిడి ఏర్పడి రబ్బరు గొట్టం ద్వారా నాజిల్ ద్వారా బయటకు వెలువడుతుంది. పిస్టన్ కదిలించటానికి హ్యాండిల్ ఉంటుంది. దీనితో రసాయన ద్రావణం అంతటా సమంగా పడుతుంది.